సమాచారం

విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: కాటేదాన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ సంజీవులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో మరమ్మతుల కారణంగా కోతలు విధిస్తున్నట్లు తెలిపారు.

నియామకం

శంషాబాద్: శంషాబాద్ మండల మహేంద్ర (మేదరి) కుల సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం జిల్లా కార్యవర్గ సభ్యుల సమక్షంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పిల్లి మల్లేష్‌ను జిల్లా అధ్యక్షుడు ఇందూరి శ్రీనివాస్ నియమించారు. ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్, గౌరవ అధ్యక్షుడిగా నోముల కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రవీణ్, ఉపాధ్యక్షుడిగా చిట్యాల అరవింద్, కార్యవర్గ సభ్యులుగా బాలకుమార్, గోపాల్, క్రాంతి, నాగరాజు, ఆంజనేయులు, జగదీశ్ తదితరులను నియమించారు.

రవికుమార్‌కు డాక్టరేట్

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం లైబ్రేరియన్ ఎస్.పీ.రవికుమార్‌కు ఉస్మానియా యూనవర్సిటీ పీహెచ్‌డీ డాక్టరేట్ ప్రదానం చేసింది. గ్రాంథాలయాల నిర్వహణలో పరిశోధనకు గాను రమికుమార్‌కు డాక్టరేట్ లభించింది.

క్లుప్తంగా...

మాణిక్‌రావ్ ఠాక్రేకు సన్మానం



శంషాబాద్: శంషాబాద్ పట్టణానికి చెందిన సీనియర్ మహిళా కాంగ్రెస్ నాయకురాలు, మాజీ డీసీసీ ప్రతినిధి మైలారం సులోచన గురువారం తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రేను సన్మానించారు.

మంత్రికి ఆహ్వానం



మణికొండ: మణికొండ మున్సిపాలిటీ, పుప్పాలగూడ గ్రామంలో ఈ నెల 23 నుంచి నిర్వహించనున్న బీరప్ప ఉత్సవాలకు రావాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి, చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డిలను నిర్వాహకులు ఆహ్వానించారు. గురువారం మున్సిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో దేవాలయ కమిటీ నాయకులు వారిని కలిసి ఆహ్వానపత్రికలు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు గుట్టమీది నరేందర్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శన

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని పద్మాశాలిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవి అన్నారు. ఆగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థుల మేధస్సును గుర్తించి వారిని ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు.



స్వామి వివేకానందకు నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్



జయంతి కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద



వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి: యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానందుడు అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. స్వామి వివేకానంద 160వ జయంతిని పురస్కరించుకొని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పద్మాశాలిపురంలో వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రేమ్‌గౌడ్, అక్కెం రఘు, కుమార్, యాదగిరి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కాటేదాన్‌లో..

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాటేదాన్‌లోని బీజేపీ కార్యాలయంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వివేకానంద విగ్రహానికి నివాళులర్పించారు.

నివాళులర్పించిన బండి సంజయ్..

శంషాబాద్: జాతీయ యువజన దినోత్సవం, స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు బుక్క వేణుగోపాల్ ఊట్‌పల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌లో..

రాజేంద్రనగర్: వివేకానంద జయంతి కార్యక్రమాలను రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని స్వామి వివేకానంద విగ్రహాలతో పాటు చిత్రపటాలను ఏర్పాటు చేసి నివాళులర్పించారు. అత్తాపూర్ హైదర్‌గూడలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ సంగీతాగౌరీశంకర్ పాల్గొన్నారు.



జయంతి వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ సంగీతా గౌరీశంకర్



మహావీర్ కళాశాలలో..



యువజన దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ వరప్రసాద్

మణికొండలో..

మణికొండ: దేశ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పి యువతకు మార్గదర్శకంగా నిలిచిన స్వామి వివేకానంద జయంతిని గురువారం మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో ఘనంగా నిర్వహించారు. మణికొండ మున్సిపాలిటీ అలకాపూర్ టౌన్‌షిప్ చింతచెట్టు చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, నార్సింగి మున్సిపాలిటీ, ఖానాపూర్‌లో జరిగిన కార్యక్రమంలో కౌన్సిలర్ జి.అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యానవన విశ్వవిద్యాలయంలో..

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని కొండా లక్ష్మణ్ ఉద్యానవన విశ్వవిద్యాలయంలో గురువారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ పి.వి.వరప్రసాద్ పాల్గొని యువజన దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు.



కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్ అమరేందర్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న మణికొండ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

'కంటి వెలుగు'ను విజయవంతం చేయండి



మున్సిపల్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, కౌన్సిలర్లు

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వం కంటి చూపు సమస్యలు ఉన్న వారికి మేలు జరిగేలా ఈ నెల 18వ తేదీ నుంచి నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి కౌన్సిలర్, అధికారులు కలిసికట్టుగా కృషి చేయాలని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ సూచించారు. గురువారం నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖ యాదగిరి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి వార్డులో జనాభాకు అనుగుణంగా క్యాంపులు ఏర్పాటు చేస్తారని, కంటి పరీక్షలను నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేస్తారన్నారు. ప్రజలకు ఈ విషయాన్ని తెలయజేసి ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రజల అవసరాలకు అనుగుణంగా నిధులు కేటాయించి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

తీర్మాణాలు ఇవీ..

నార్సింగి మున్సిపాలిటీ కార్యాలయంలో గురువారం జరిగిన సర్వసభ్య సమావేశంలో సభ్యులు పలు తీర్మాణాలు చేశారు. అందులో రూ.13.73 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం, రూ.2కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణం, రూ.2.90 కోట్లతో కమ్యూనిటీహాల్స్ నిర్మాణం చేపట్టాలని ఏకగ్రీవంగా తీర్మాణాలు చేశారు. మున్సిపాలిటీ పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను ఆదునీకరించేందుకు రూ.6.20 కోట్లను ఖర్చుచేయాలని నిర్ణయించారు. సీసీ కెమరాల ఏర్పాటుకు రూ.75లక్షలు, ఇతర అభివృద్ధి పనులకు రూ.10.10 కోట్లను ఖర్చుచేయాలని తీర్మాణం చేశారు. త్రీఫేజ్ విద్యుత్ లైన్‌కు రూ.కోటి ఖర్చుచేయడానికి అంగీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సి.సత్యబాబు, వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్, కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ముట్టడి..

నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో నిర్మిస్తున్న జలమండలి రిజర్వాయర్ నుంచి స్థానిక ప్రజలకే నీటిని సరఫరా చేయాలని, గేటెడ్ కమ్యూనిటీలకు ఆ నీటిని సరఫరా చేస్తే సహించే ప్రసక్తే లేదని నార్సింగి వాసులు మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. నార్సింగి కేంద్రంగా నిర్మాణంలో ఉన్న రిజర్వాయర్ సామర్థ్యం 5లక్షల లీటర్లు ఉందని, దాని నుంచి ఒక రోజు గేటెడ్ కమ్యూనిటీలకు, మరో రోజు స్థానికులకు సరఫరా చేస్తామని జలమండలి జీఎం రవీందర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ వారికి సర్ది చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు వారిగా వస్తున్న పైప్ లైన్ నుంచి వారికి కనెక్షన్ ఇవ్వాలని, లేదంటే గిరిగిరి గడ్డలో మరో రిజర్వాయర్ నిర్మించాలని వారు డిమాండ్ చేశారు.

మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి



సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

మైలార్‌దేవ్‌పల్లి: మహిళలను ప్రొత్సహిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారని గగన్‌పహాడ్ ఈఆర్ఓ అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ గోపినాగమణి అన్నారు. గురువారం విద్యుత్ శాఖలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు నిర్వహించిన క్రీడల పోటీలలో ప్రతిభ చూపిన సీనియర్ అసిస్టెంట్ సుధాపరిమల్, జూనియర్ అసిస్టెంట్ ఉషశ్రీలను సన్మానించారు. కార్యక్రమంలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ రవీందర్, శ్రీహరిరావు, వెంకటకృష్ణ, సిబ్బంది మల్లేష్, పద్మనాభం, రవిప్రసాద్, కిరణ్, సురేష్, శివకుమార్, నాగేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నార్సింగిలో అన్నపూర్ణ క్యాంటీన్ ప్రారంభం



అన్నపూర్ణ క్యాంటీన్‌ను ప్రారంభించి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: పేదల ఆకలి తీర్చే అన్నపూర్ణ క్యాంటీన్‌ను ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ గురువారం నార్సింగిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరంలో మాదిరిగానే మున్సిపాలిటీలలోనూ అన్నపూర్ణ క్యాంటీన్‌లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరడంతో అంగీకరించినట్లు తెలిపారు. పేదల ఆకలి తీర్చేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఒక ప్లేటు భోజనం తయారీకి రూ.26.25పైసలు అవుతుండగా నార్సింగి మున్సిపాలిటీ నుంచి రూ.21.25 పైసలను చెల్లిస్తున్నామని, పేదలు రూ.5చెల్లించి భోజనం చేయవచ్చన్నారు. ప్రతిరోజూ 360 మందికి భోజనం అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మున్సిపల్ చైర్ పర్సన్ డి.రేఖాయాదగిరి, వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్‌లతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలోమున్సిపల్ కమిషనర్ సి.సత్యబాబు, మేనేజర్ యోగేష్, కౌన్సిలర్‌లు పత్తి ప్రవీణ్‌కుమార్, జి.శివారెడ్డి, ఉషారాణి, జి.అరుణజ్యోతి, జి.అమరేందర్‌రెడ్డి, పత్తి శ్రీకాంత్‌రావు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌పై పోలీసులకు ఫిర్యాదు

మణికొండ: మంత్రి కేటీఆర్‌పై సోషల్ మీడియాలో అసభ్య పదజాలంతో దూషించిన సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు బి.శ్రీరాములు నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయంగా పార్టీలు వేరైనా హుందాగా వ్యవహరించినపుడే ప్రజలు ఆదరిస్తారనే విషయాన్ని కార్పొరేటర్ గమనించాలన్నారు. ఆమెపై చట్టరీత్యా కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం వస్తుంది



మాణిక్‌రావు ఠాక్రేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సదాలక్ష్మి

మైలార్‌దేవ్‌పల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం రానుందని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు అబ్బెశి సదాలక్ష్మి అన్నారు. గురువారం గాంధీ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రేను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై ఆయనతో చర్చించారు. సాయంత్రం మైలార్‌దేవ్‌పల్లిలో ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి పట్టం పట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

కౌన్సిల్ సమావేశం



కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌లో 23వ సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రెండవ దశ కంటి వెలుగు అవగాహన సదుస్సు నిర్వహించారు. కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు తీర్మాణం చేశారు. మొత్తం రూ.4.53 కోట్ల పనులకు ఆమోదం తెలిపారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ.. కార్పొరేషన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. కోట్ల రూపాయలు వెచ్చించి సమస్యలను పరిష్కరిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి, కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఈ శివానంద్, డీఈ యాదయ్య, ఏఈ రాజీవ్‌రెడ్డి, డీసీసీ సాంబయ్య, టీపీఎస్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పార్కు స్థలంలోని నిర్మాణాలను కూల్చివేస్తాం

సాక్షి ఎఫెక్ట్

రాజేంద్రనగర్: కనిపిస్తే కబ్జా అనే శీర్షికతో బుధవారం రాజేంద్రనగర్ జోన్ 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జీహెచ్ఎంసీ అధికారులు స్పందించారు. సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారి కృష్ణమోహన్ తన సిబ్బందితో గురువారం ఉదయం జనచైతన్య వెంచర్‌ను సందర్శించారు. కబ్జాకు గురైన పార్కు స్థలాన్ని పరిశీలించారు. అనంతరం సాయంత్రం నిర్వాహకుడికి నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ.. పార్కు స్థలంలో నిర్మాణ విషయమై అధికారుల ఆదేశం మేరకు పరిశీలించినట్లు తెలిపారు. నిర్మాణదారుడికి నోటీసులు అందించామని, పార్కు స్థలంగా నిర్ధారణ అయితే నిర్మాణాన్ని కూల్చివేస్తామన్నారు. పార్కు స్థలాలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను ఎప్పటికైనా కూల్చివేయక తప్పదన్నారు. సర్కిల్ పరిధిలో కొత్తగా నిర్మాణాలు చేపట్టే వారు తప్పనిసరిగా జీహెచ్ఎంసీ నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. అదనపు అంతస్తులు నిర్మించిన కూల్చివేస్తామన్నారు.

సంక్రాంతి వేడుకలు షురూ..



గణేష్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

మణికొండ: ప్రతి పండుగకు ఒక సాంప్రదాయం, సంస్కృతి ఉంటుందని, వాటి విశిష్టతను ముందు తరాలకు అందించాల్సిన భాద్యత మనపై ఉందని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్న దేవాలయం రోడ్డులో డ్వాక్రా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముగ్గులతో ఇంటికి శోభ రావడంతో పాటు మన సంస్కృతి ప్రతి ఒక్కరికీ తెలుస్తుందన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ముగ్గులు వేసిన మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్, వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

రవీంద్రభారతి పాఠశాలలో..

రాజేంద్రనగర్: అత్తాపూర్ రవీంద్రభారతి పాఠశాలలో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. పాఠశాలలో బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. విద్యార్థులు వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఇలాంటి కార్యక్రమాలతో పిల్లలకు పండుగల ప్రాముఖ్యత తెలుస్తుందని పాఠశాల ప్రిన్సిపాల్ సుధ వెల్లడించారు.



ముగ్గులను పరిశీలిస్తున్న మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్



సంక్రాంతి వేడుకల్లో రవీంద్రభారతి స్కూల్ విద్యార్థులు

మైలార్‌దేవ్‌పల్లిలో..

మైలార్‌దేవ్‌పల్లి: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని పలు పాఠశాలల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు రంగురంగుల ముగ్గులను వేశారు. లక్ష్మిగూడలోని విజేత టాలెంట్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ రాజు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఉత్తమ ముగ్గులను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. గణేష్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రంగోళి పోటీలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.రఘుపతి, ఉపాధ్యాయులు ఎస్.మాణిక్యంరెడ్డి, జాన్‌సన్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని వినతి



ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసరావుకు వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్ల చౌరస్తా నుంచి తెల్లాపూర్ వెళ్లే సర్కిల్‌లో ఏర్పాటు చేసిన దిమ్మె సైజ్‌ను తగ్గించి అక్కడ సిగ్నల్స్, జీబ్రా క్రాసింగ్ లైన్ ఏర్పాటు చేయాలని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. గోపన్‌పల్లి తండా నుంచి ఎన్టీఆర్‌నగర్ వైపు వెళ్లే రోడ్డు పక్కనే ఉన్న టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ వద్ద సైతం ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రా క్రాసింగ్ లైన్ ఏర్పాటు చేయాలని డీసీపీకి విజ్ఞప్తి చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లో ఐటీ కంపెనీలు, ఇంటర్నేషనల్ స్కూల్స్, చేరువలోనే ఉన్నత విద్యా సంస్థలు ఉన్నందున రాకపోకలు సాగించే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని, ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉత్పన్నమవుతున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని డీసీపీ హామీ ఇచ్చారని కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి తెలిపారు.

మెరుగైన ఫలితాల సాధనపై దృష్టి పెట్టాలి



రాయదుర్గం: రాయదుర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్ రాజీవ్ గురువారం పరిశీలించారు. మొదట ఆయన రాయదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ పాఠశాల, అనంతరం ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ నిర్వహణ, తరగతి గది బోధనను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఉన్నత పాఠశాల రాయదుర్గంలో పదవ తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతుల నిర్వహణను పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఫలితాలు మెరుగ్గా రావడంపై అందరూ దృష్టి పెట్టాలని, విద్యార్థులకు అన్ని అంశాలపై అవగాహన పెరిగేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థుల డౌట్లను ఎప్పటికప్పుడు తీర్చేలా చూడాలని ఆయన ఆదేశించారు. ఆయన వెంట స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం తాజ్‌బాబు, సీఆర్‌పీ రాజశేఖర్ ఉన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9553955684
9010221230